సాక్షి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 9 । డిసెంబర్ । 2024



సోమశిలలో 73.18 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 73.18 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి 4,932 క్యూసెక్కుల వరద వస్తోంది. డెల్టాకు 2,500, ఉత్తరకాలువకు 500, కండలేరుకు 5 వేలు, దక్షిణ కాలువకు 150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.78,450
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.7,115
3 శాతం జీఎస్టీతో	రూ.7,328
సవర (8 గ్రా)	రూ.58,624

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
29.6 /25.0

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. అక్కడక్కడ తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉంది. ఆదివారం గాలిలో తేమ 79 శాతం ఉంది.

న్యూస్‌రీల్

జొన్నవాడ ఈఓపై విచారణ



జొన్నవాడ ఈఓను విచారిస్తున్న దేవదాయశాఖ అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డిపై దేవదాయశాఖ అధికారులు ఆదివారం విచారణ చేపట్టారు. అమ్మవారి భక్తుడైన మల్లికార్జున ఇటీవల ఆలయానికి సంబంధించిన విషయాలపై దేవదాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. నవరాత్రులు ముగిసిన తర్వాత అర్ధరాత్రి నిర్వహించే కాళరాత్రి నవావరణ పూజల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించలేదని, ఆలయ ఈఓ భక్తుల పట్ల అనుచితంగా ప్రవర్తించారని ఆరోపించారు. తాను తన కుటుంబ సభ్యులతో కలిసి అన్నదాన సత్రంలోకి వెళితే చొక్కా పట్టి బయటకు తోసివేశాడని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, పెంచలకోన దేవస్థానం ఈఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ భక్తుడి ఫిర్యాదు మేరకు ఆలయ ఈఓను విచారించామన్నారు. ఇద్దరి స్టేట్‌మెంట్లు రికార్డు చేశామని తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని వివరించారు. ఆలయ ఈఓను వివరణ కోరగా నవరాత్రుల అనంతరం నిర్వహించే కాళరాత్రి నవావరణ పూజలకు ఉభయకర్తల బంధుమిత్రులను మాత్రమే అనుమతించడం ఆలయ సంప్రదాయమని, అందుకే వేరెవరిని అనుమతించలేదన్నారు. అన్నదానం వద్ద ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ వల్ల గడిచిన ఐదు నెలల్లో రూ.50 లక్షలు మిగిలించి, ఆలయ అకౌంట్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశామని తెలిపారు.

నాటు తుపాకీ మిస్ ఫైర్

- గిరిజనుడి మృతి



సుధాకర్ మృతదేహం

రాపూరు: నాటు తుపాకీ మిస్‌ఫైర్ అయ్యి ఓ గిరిజనుడు మృతి చెందాడు. ఈ ఘటన రాపూరు మండలం పెనుబర్తిలో జరిగింది. గ్రామస్తుల కథనం.. పెనుబర్తికి చెందిన తాళ్ల సుధాకర్ (27), శోంటిమణి, శివకుమార్ కలిసి శనివారం రాత్రి గ్రామ సమీపంలోని అడవిలోకి పందుల వేటకు వెళ్లారు. అక్కడ ఏమి జరిగిందో ఏమో గానీ శోంటిమణి చేతిలో ఉన్న తుపాకీ పేలి సుధాకర్ కణతకు తగిలింది. రక్త స్రావం కావడంతో అతన్ని ఇంటికి తీసుకొచ్చేశారు. ఈ విషయం ఆదివారం గ్రామస్తులకు తెలియడంతో 108 వాహనం ద్వారా రాపూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సుధాకర్ మృతి చెందాడు. ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, సీఐ విజయ్ కృష్ణ, కండలేరు, మర్రిపాడు ఎస్‌ఐలు రామకృష్ణ, శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మణి, శివకుమార్ పరారీలో ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, పూర్తి వివరాలు త్వరలో అందిస్తామని పోలీసులు తెలిపారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వాటర్ ప్లాంటుకు 'పసుపు' రంగు



ఇటీవల వేసిన పసుపు రంగు

ముత్తుకూరు: గత ప్రభుత్వంలో నిర్మించిన కట్టడాలకు, పథకాలకు తెలుగు తమ్ముళ్లు పసుపు రంగు వేయడం ప్రారంభించారు. గత ప్రభుత్వంలో రంగులపై హైకోర్టుకు వెళ్లి నానా హంగామా చేసిన టీడీపీ నేతలు గత ప్రభుత్వంలో చేపట్టిన పథకానికి పసుపు రంగు పులిమి మురిసిపోతున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలల ముందు మల్లూరులో స్వచ్ఛమైన తాగు నీరు అందించాలన్న ఉద్దేశంతో మండల పరిషత్ గ్రాంట్ రూ.7 లక్షల వ్యయంతో ఆర్వో ప్లాంట్‌ను నిర్మించారు. ఈ ఆర్వో ప్లాంటు ద్వారా ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. అయితే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడి తర్వాత కూటమి ప్రభుత్వం రావడతో తెలుగు తమ్ముళ్ల దృష్టి ఈ ఆర్వో ప్లాంట్‌పై పడింది. ప్లాంటు గదికి వేసిన రంగులు తుడిపేసి, యుద్ధ ప్రాతిపదికన పసుపు రంగు వేసి మురిసిపోతున్నారు.

బూడిదనూ వదలా..

సర్వేపల్లి నియోజకవర్గాన్ని తమ్ముళ్లు అక్రమాలకు అడ్డాగా మార్చుకున్నారు. ఇసుక, గ్రావెల్, మట్టి నుంచి మద్యం దుకాణాల్లో వాటాలు, సాగునీటి కాలువల్లో పనులతో ఎడాపెడా దోపిడీ చేస్తున్న షాడో.. దామోదర సంజీవయ్య సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌లో విడుదలయ్యే బూడిదను వదలకుండా సొమ్ము చేసుకుంటున్నారు. ఊరు..పేరు కనిపించని కంపెనీల పేరుతో నకిలీ ఐడీలు సృష్టించి బోగస్ చలానాలతో రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాలకు తరలించి నెలకు రూ.లక్షల్లో జేబులు నింపుకుంటున్నారు.

- నిత్యం 20 బల్కర్ల ద్వారా 800 టన్నుల ఫ్లైయాష్ అక్రమ రవాణా
- అక్రమార్కులకు సహకరిస్తున్న ఏపీ జెన్‌కో అధికారులు
- నకిలీ ఐడీలు సృష్టించి.. బోగస్ కంపెనీల పేరుతో చలానాలు
- షాడో నేత కనుసన్నల్లో సిమెంట్ ఫ్యాక్టరీలకు తరలింపు
- టన్ను బూడిద రూ.వెయ్యి వంతున విక్రయం
- నెలకు రూ.పాతిక లక్షల వరకు అక్రమ సంపాదన





చిరునామా లేని డెలివరీ చలానా

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ నేతల అక్రమ వ్యాపారానికి కాదేది అనర్హం అన్నట్లు బూడిద సైతం ఫలహారంగా మారింది. జెన్‌కోలోని కొందరు అధికారుల అండదండలతో అధికార పార్టీ నేతలు ఈ అక్రమ రవాణాతో నెలకు సగటున రూ.25 లక్షలు జేబుల్లో వేసుకుంటున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదలైన ఈ అక్రమ రవాణా ఇప్పుడు శాఖోపశాఖలుగా విస్తరించడంతో జిల్లాలో హాట్ టాపిక్ అయింది. దామోదర సంజీవయ్య సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌లో విద్యుత్ ఉత్పత్తి చేయడానికి బొగ్గును మండిస్తున్నారు. బొగ్గు మండిన తర్వాత రెండు రకాల బూడిద వెలువడుతుంది. పౌడర్‌గా ఉన్న బూడిదను ఫ్లైయాష్‌గా, కొంత రవ్వలాగా ఉన్న బూడిదను బాటమ్ యాష్‌గా పిలుస్తారు. పౌడర్‌లా ఉండే ఫ్లై యాష్ సిమెంట్ తయారీలో ఉపయోగిస్తారు.

నిత్యం 6 వేల టన్నుల ఫ్లైయాష్ ఉత్పత్తి

ఏపీ జెన్‌కోలో ప్రతి రోజు మూడు యూనిట్ల ద్వారా సగటున దాదాపు 6 వేల టన్నుల ఫ్లైయాష్ వస్తోంది. ఆ ఫ్లైయాష్‌ను సిమెంట్ ఫ్యాక్టరీలకు, బ్రిక్స్ తయారీలో ఉపయోగిస్తారు. వాస్తవంగా జెన్‌కో ద్వారా విడుదలయ్యే ఫ్లైయాష్‌ను 20 శాతం ఉచితంగా సిమెంట్ కంపెనీలకు ఇవ్వాలి. మరో 80 శాతం విక్రయం చేసుకోవచ్చు. దీన్ని అవకాశంగా తీసుకున్న నియోజకవర్గ షాడోగా వ్యవహరిస్తున్న నేత ఎన్నికల కౌంటింగ్ మరుసటి రోజునే జెన్‌కో అధికారులపై ఒత్తిడి పెట్టి వసూళ్ల దందాకు పూనుకున్నాడు. 20 శాతం ఉచితంగా ఇచ్చే బూడిదను సిమెంట్ ఫ్యాక్టరీలకు ఉచితంగా ఇవ్వకుండా తనకు మాత్రమే ఇవ్వాలని పట్టుబట్టి చేజిక్కించుకున్నాడు.

తప్పుడు అడ్రస్‌లు.. చలానాలు

ఉచితంగా ఇవ్వాల్సిన 20 శాతం ఫ్లైయాష్‌ను పక్క రాష్ట్రాలకు తరలించేందుకు వాహనాలకు ఏపీ జెన్‌కో ఇచ్చే చలానాల్లో తప్పుడు అడ్రస్‌లు ఇవ్వడం ఇటీవల వెలుగులోకి వచ్చింది. ఈ నెల 7న ఫ్లైయాష్ లోడుతో వెళ్తున్న వాహన చలానాను పరిశీలిస్తే అరవింద ఫ్లైయాష్ బ్రిక్స్ పేరుతో ఉంది. వాస్తవంగా ఆ కంపెనీ ఏ ప్రాంతంలో ఉందో స్పష్టంగా చిరునామా లేదు. చలానాలో అరవింద బోగస్ పేరుతో చలానా ఉండడంతో ఇది పక్కా నకిలీ అని స్పష్టంగా తెలుస్తోంది. జెన్‌కో అధికారులు అండతో డెలివరీ చలానాలో తప్పుడు చిరునామాలు చూపిస్తూ అడ్డదారిలో పక్క రాష్ట్రాలకు పంపించి సొమ్ము చేసుకుంటున్నారు.

వెయ్యి టన్నుల అక్రమ రవాణా

జెన్కో ప్రాజెక్ట్ నుంచి నిత్యం 20 బల్కర్లతో దాదాపు 800 నుంచి వెయ్యి టన్నుల బూడిద ఇతర రాష్ట్రాలకు తరలిపోతోంది. సిమెంట్ ఫ్యాక్టరీలు, బ్రిక్స్ తయారీ కోసం ఉపయోగించే ఫ్లైయాష్‌ను నకిలీ బిల్లులతో ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్న వైనం వెలుగులోకి వచ్చింది. సదరు నేత ఫ్లైయాష్‌ను విక్రయించేందుకు 10 బోగస్ అకౌంట్లు క్రియేట్ చేసి ప్రతి రోజు ఒక్కో అకౌంట్ ద్వారా రెండు బల్కర్ల నిండా దళారుల ద్వారా సిమెంట్ కంపెనీలకు సరఫరా చేస్తున్నాడు.



బల్కర్ ద్వారా బూడిద రవాణా చేస్తున్న దృశ్యం

అయితే ఈ బూడిద ఎక్కడికి పోతోందో ఎవరికి అంతుపట్టని బ్రహ్మరహస్యంగా ఉంది.

నెలకు రూ.పాతిక లక్షలపైమాటే..

టన్ను బూడిద రూ.వెయ్యి వంతున విక్రయిస్తున్నట్లు సమాచారం. ఒక్కొక్క బల్కర్‌కు దాదాపు 40 నుంచి 50 టన్నుల వంతున రోజుకు 20 బల్కర్లు ద్వారా 800 నుంచి వెయ్యి టన్నులు రవాణా చేస్తున్నారు. ఈ లెక్కన రోజుకు రూ.లక్ష వరకు.. నెలకు పాతిక లక్షల మేర సంపాదించుకుంటున్నట్లు సమాచారం. ఫ్లై యాష్‌పై అక్రమ రవాణాపై విచారణ జరిపితే ఇంకా మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. ప్రజాప్రతినిధులు తమ స్వార్థం కోసం బూడిదను వదలకపోవడంపై నియోజకవర్గ ప్రజలు ఛీదరించుకుంటున్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు నాల్గో సారి షెడ్యూలు

- ఈ నెల 11న నోటిఫికేషన్ విడుదల

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియకు నాల్గో సారి షెడ్యూల్ విడుదలైంది. ఇప్పటికే మూడు సార్లు వాయిదా వేశారు. తాజాగా విడుదలైన షెడ్యూల్ మేరకు ఈ నెల 11న నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. జిల్లాలోని జలవనరులశాఖ, సోమశిల, తెలుగుగంగ ప్రాజెక్ట్‌లకు సంబంధించి 6 ప్రాజెక్ట్ కమిటీలకు, 13 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైన విషయం విదితమే. వీటితోపాటు 490 వాటర్ యూజర్స్ అసోసియేషన్లకు, 3,698 టీసీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. 14న టీసీ సభ్యులు ఎన్నికతో పాటు వాటర్ యూజర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక జరుగుతుంది. ఈ నెల 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు జరుగుతాయి. జిల్లా వ్యాప్తంగా మూడు లక్షల మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది. ఎన్నికల నిర్వహణకు 9,114 మంది సిబ్బంది ఎంపిక చేసిన జిల్లా యంత్రాంగం వీరికి శిక్షణ కూడా పూర్తి చేసింది.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సింహపురి చిత్రకారుడికి చోటు

- అతిపెద్ద వర్లీపెయింటింగ్‌కు గుర్తింపు



అమీర్‌జాన్‌కు తెలుగుబుక్ ఆఫ్ రికార్డును అందజేస్తున్న వెంకటాచారి, కృష్ణారెడ్డి

నెల్లూరు (బృందావనం): నెల్లూరు చిత్రకారుడు అమీర్‌జాన్ తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు దక్కింది. సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ చింతపట్ల వెంకటాచారి స్వయంగా నెల్లూరులో 25 కళాసంఘాల కార్యాలయంలో ఆదివారం ఆ రికార్డును, ధ్రువీకరణపత్రాన్ని అమీర్‌జాన్‌కు అందజేసి అభినందించారు. పురాతన భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే వర్లీ పెయింటింగ్‌ను పసుపు, కారంతో 2022 ఫిబ్రవరి 2న 789.99 చదరపు అడుగుల విస్తీర్ణంలో చిత్రీకరించారన్నారు. అతిపెద్ద చిత్రం చిత్రించిన అమీర్‌జాన్ తెలుగు వారికి గర్వకారణమన్నారు. 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో అమీర్‌జాన్ తన చిత్రకళా ప్రతిభతో 50కిపైగా రికార్డులను అందుకుని సింహపురి ఖ్యాతిని దశదిశలా చాటారన్నారు.

సీహెచ్‌సీ ఉద్యోగి సరెండర్

పొదలకూరు : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న సుహేత్‌బాబును డీసీహెచ్‌ఎస్‌కు సరెండర్ చేసినట్లు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ యూ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సుహేత్‌బాబు తన విధులను సక్రమంగా నిర్వహించకుండా మద్యం తాగి విధులకు హాజరు కావడం, సిబ్బందితో అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్ని పర్యాయాలు హెచ్చరించినా తన తీరు మార్చుకోకపోవడంతో సరెండర్ చేసినట్లు స్పష్టం చేశారు.

పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్‌గా రామారావు

నెల్లూరు (టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ సముద్రాల రామారావు నియమితులయ్యారు. ఆయన ఆదివారం కళాశాలలో బాధ్యతలు స్వీకరించారు. తూర్పుగోదావరి జిల్లా ద్రాక్షారామంలోని పాలిటెక్నిక్ కళాశాలలో హెచ్‌ఓడీగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఈ కళాశాలలో సివిల్ విభాగం హెచ్‌ఓడీ రాంప్రసాద్ ఎఫ్‌ఏసీ ప్రిన్సిపల్‌గా వ్యవహరిస్తున్నారు.

తీర్చిదిద్దితే బీచ్ టూరిజం

- ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించే రంగం
- రవాణా వసతులు పుష్కలంగా ఉండడం అనుకూలం
- టూరిజానికి కేంద్రం వడ్డీలేని దీర్ఘకాలిక రుణాలు
- గత ప్రభుత్వంలోనే ప్రతిపాదనలు



నిర్మాణంలో ఉన్న రామాయపట్నం పోర్టు





సిద్ధమైన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్

కావలి: జిల్లాలోనే అత్యధిక సముద్రతీరం ఉన్న కావలి ప్రాంతంలో బీచ్ టూరిజం అభివృద్ధికి గత ప్రభుత్వంలోనే ప్రతిపాదనలు వచ్చాయి. ఆ ప్రభుత్వంలోనే సంకల్పించిన కావలి తీరానికి ఉత్తరాన రామాయపట్నం పోర్టు, దక్షిణాన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ రూపుదిద్దుకుంటున్నాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా కల్పించే ఈ ప్రాజెక్ట్‌లు పూర్తయితే వీటి మధ్య ప్రాంతంలో దేశీయంగా ప్రఖ్యాతగాంచిన బీచ్‌లతో పోటీపడుతూ టూరిజం అభివృద్ధి చేయాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భావించింది. తద్వారా కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉండే అవకాశం ఉంది.

ప్రకృతి రమణీయత ఉట్టిపడే తుమ్మలపెంట బీచ్

కావలి తూర్పు తీరంలోని తుమ్మలపెంట్ బీచ్ ప్రాంతంలో ప్రకృతి రమణీయత ఉట్టిపడుతోంది. దశాబ్దాలుగా గత ప్రభుత్వాల నిరాదరణకు గురైన ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా, ఉపాధి, ఉద్యోగావకాశాలకు, పర్యాటకానికి స్వర్గధామంగా మార్చేందుకు గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రామాయపట్నం సీ పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు శ్రీకారం చుట్టారు. భవిష్యత్‌లో ఈ ప్రాంతాలు పర్యాటక ప్రదేశాలుగా రూపుదిద్దుకుంటాయి. ఈ రెండింటి మధ్య 20 కి.మీ. సముద్ర తీరం ఉంటుంది. వాటికి అనుబంధంగా బీచ్ టూరిజం ఏర్పాటు చేస్తే తీరంలో బోటు షికారుకు అనుకూలమైన అలల వాతావరణంపై కూడా ప్రాథమికంగా సర్వే కూడా చేసింది. బీచ్‌లో పార్కులు, పిల్లల ఆట వస్తువులు, ఫుడ్ కోర్టులు, ఇతర షాపింగ్ సెంటర్లు, విడిది (హోటళ్లు), వినోద కేంద్రాలను ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం ఆలోచన చేసింది.

రూపుదిద్దితే.. భూతలస్వర్గమే

ప్రపంచమంతా ఉద్యోగ, ఉపాధి కల్పించేది పర్యాటకం, ఆతిథ్య రంగాలకు ప్రాధాన్యమిస్తోంది. కుటుంబంతో కలిసి ఆహ్లాదాన్ని పొందేందుకు బీచ్ బెస్ట్ సందర్శనీయ ప్రదేశాలు ప్రజలను మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. పర్యాటకులను ఆకర్షించే వసతులు కల్పిస్తే పర్యాటక చిత్ర పటంలో కూడా కావలి బీచ్ భూతల స్వర్గమే అవుతోంది. ప్రభుత్వం రాయితీలు ఇచ్చి పర్యాటకులను ఆకర్షించేలా ప్రాజెక్ట్‌లు సిద్ధం చేసి ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో చేసే అవకాశం ఉంది.

పోర్టు.. హార్బర్ మధ్యలో బీచ్

కావలి తూర్పు ప్రాంతంలోని విశాల సముద్ర తీరం.. ప్రకృతి రమణీయతను రంజింప చేస్తోంది. బోటు షికార్‌కు అనుకూలమైన ప్రశాంత అలల వాతావరణం. తీరానికి అనుసంధానమవుతూ సాగే బకింగ్ హామ్ కెనాల్. ఉత్తరాన రామాయపట్నం పోర్టు, దక్షిణాన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్. ఈ రెండు ప్రాంతాలను కలుపుతూ తీరం వెంబడి సాగే రహదారి.. కావలి మీదుగా చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి, ఉత్తర, దక్షిణ భారతదేశాలను కలిపే రైలు ప్రధాన మార్గం. ఎన్నెన్నో అనుకూలతలు ఉన్న ఈ తీరాన్ని తీర్చిదిద్దితే బీచ్ టూరిజంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఐకానిక్ టూరిస్ట్ కేంద్రాల సమగ్రాభివృద్ధి, ప్రపంచ స్థాయిలో బ్రాండింగ్‌ను మార్కెటింగ్ చేసేలా రాష్ట్రాలను ప్రోత్సహిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా వడ్డీ రుణాలను అందిస్తోంది.

పర్యాటానికి ఎన్నెన్నో అనుకూలతలు

పర్యాటకంలో ప్రధానంగా కోస్టల్ ప్రాంతాలే కీలకం కావడం గమనార్హం. అయితే రోడ్లు, విద్యుత్, నీటి సరఫరా, సీవరేజ్, టెలికమ్యూనికేషన్, గమ్యస్థానానికి యాక్సెస్, కనెక్టివిటీ తదితర అంశాలు పర్యాటక రంగంపై ప్రభావితంగా ఉంటాయి. పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్న ప్రదేశాల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. అయితే ఇప్పటికే కావలి తీరానికి అనుబంధంగా చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారి, ఉత్తర, దక్షిణ ప్రాంతాలను కలిపే రైలుమార్గం అనువుగా ఉన్నాయి. దేశంలోని అన్ని ప్రాంతాలకు కనెక్టివిటీ ఉన్న మార్గాలు కావడం గమనార్హం. రామాయపట్నం సీ పోర్టు ప్రారంభమైతే కావలికి సముద్ర మార్గ ప్రయాణం కూడా అందుబాటులోకి వచ్చినట్లే. రానున్న రోజుల్లో దామవరం వద్ద విమానాశ్రయాన్ని నిర్మించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. మరో రెండేళ్లలో ఆకాశ మార్గంలో ప్రయాణం కూడా అందుబాటులోకి వస్తోంది. ఇలా రోడ్డు, రైలు, సముద్రం, ఆకాశం మార్గాల అవకాశం కలిగి ఉండడం కూడా బీచ్ టూరిజంకు ఒక వరం కానుంది.


బీచ్ టూరిజంలో చిన్న, పెద్ద పర్యాటక అంశాలు

ప్యారా సైకలింగ్	స్కై టవర్ వంటి హోటళ్లు
ప్యారాచ్యూట్	టన్నెల్ అక్వేరియం
జెట్ స్కై రైడ్	టెథర్డ్ గ్యాస్ బెలూన్
బంపర్	రోప్‌వే
బనాన రైడ్	కన్వెన్షన్ సెంటర్
బోట్ రైడ్	ఎలివేటెడ్ టాయ్ ట్రైన్
డాల్ఫిన్ ట్రిప్	మినీ జంగిల్ ఎకో రిసార్టులు
అమ్యూజ్‌మెంట్ పార్కులు	



టూరిజానికి కేంద్రం ప్రోత్సాహకాలు

పర్యాటకులు ఊర్లు, జిల్లాలు, రాష్ట్రాలు, దేశాలు దాటి వెళ్లి పర్యాటక భూతల స్వర్గాలను ఆస్వాదిస్తున్నారు. దేశీయంగా పర్యాటక రంగానికి ఆదరణ అంతకంతకూ పెరుగుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం స్వయంగా పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేసేందుకు ఉదారంగా నిధులు మంజూరు చేయడంతోపాటు ప్రోత్సహిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ప్రకటించారు. దేశీయ టూరిజం కోసం ఉద్భవిస్తున్న ఉత్సాహాన్ని పరిష్కరించడానికి, పోర్ట్ కనెక్టివిటీ, టూరిజం మౌలిక సదుపాయాల కోసం ప్రాజెక్ట్‌లు చేపడతామని నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇది ఉపాధి కల్పనలో కూడా సహాయపడుతుందని ఆమె చెప్పారు. అందులో భాగంగా ఐకానిక్ టూరిజం సమగ్రాభివృద్ధిని ప్రపంచ స్థాయిలో బ్రాండింగ్, మార్కెటింగ్ చేసేలా రాష్ట్రాలను ప్రోత్సహిస్తామని ఆమె చెప్పారు. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి రాష్ట్రాలకు దీర్ఘకాలిక వడ్డీ రహిత రుణాలను కేంద్రం అందించనున్నట్లు తెలిపారు.



క్లుప్తంగా

'చందన, సీఎమ్మార్'లో వీక్లీ డ్రా



బహుమతులను అందజేస్తున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు

నెల్లూరు(బృందావనం): క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి సందర్భంగా చందన, సీఎమ్మార్‌లో ఎక్స్‌ప్రెస్ సేల్, డైలీ, వీక్లీ, బంపర్ డ్రాలను ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా ఆదివారం నిర్వహించిన టీవీఎస్ జెస్ట్ స్కూటీ డ్రాను నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తీశారు. మైపాడు గేట్‌కు చెందిన శోభ (కూపన్ నంబర్ 16339)ను విజేతగా ప్రకటించారు. గత వారం డైలీ విజేతలు 35 మందికి గ్రైండర్లు, రైస్ కుక్కర్లు, మిక్సీలు, డిన్నర్ సెట్లు తదితరాలను అందజేశారు. ఈ సందర్భంగా చందన, సీఎమ్మార్ అధినేత మావూరి శ్రీనివాసరావు మాట్లాడారు. అత్యంత తక్కువ ధరలకు వస్త్రాలు, వన్ ప్లస్ వన్, వన్ ప్లస్ టు ఆఫర్లు, బంగారంపై గ్రాముకు రూ.200 వరకు తగ్గించి విక్రయిస్తున్నామని వివరించారు. 45 రోజుల పాటు డైలీ ఐదు గృహోపకరణాలు, వార వారం ఏడు స్కూటీలు, క్రిస్మస్, సంక్రాంతికి టాటా కార్లు, న్యూ ఇయర్‌కు మలేసియా ట్రిప్‌ను కస్టమర్లకు బహుమతులుగా అందజేస్తున్నామని పేర్కొన్నారు. రాజీ యాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య, శైలేష్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నెమ్మెమ్మెస్ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఈఓ

నెల్లూరు (టౌన్) : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్నెమ్మెమ్మెస్) పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 19 కేంద్రాల్లో పరీక్షను ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించారు. 3809 మందికి గానూ 3566 మంది విద్యార్థులు హాజరయ్యారు. నగరంలోని ఆరెస్సార్ స్కూల్లో నిర్వహించిన పరీక్షను డీఈఓ బాలాజీరావు తనిఖీ చేశారు.

16లోపు అభ్యంతరాలను తెలియజేయాలి

ఎన్నెమ్మెమ్మెస్ పరీక్షకు సంబంధించిన ప్రాథమిక కీని అధికారిక వెబ్‌సైట్ bse.ap.gov.inలో ఉంచనున్నారని డీఈఓ బాలాజీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై అభ్యంతరాలుంటే వెబ్‌సైట్‌లోని గ్రీవెన్స్ లింక్ ద్వారా ఈ నెల 16లోపు తెలియజేయాలని కోరారు.

కండలేరులో నీటి నిల్వ

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 55.072 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ నుంచి 200, సోమశిల జలాశయం నుంచి 3700 క్యూసెక్కుల నీరు వస్తోందని చెప్పారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1600, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 120, మొదటి బ్రాంచ్ కాలువకు 60 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.

కందిపప్పులో కక్కుర్తి


కార్డుదారులకు అందని వైనం

- లోపించిన నాణ్యత
- ఎమ్మెల్‌ఎస్ పాయింట్ నుంచే బ్లాక్ మార్కెట్‌కు
- సగానికి పైగా ఆదాయం వస్తుండటంతో విక్రయాలు
- డీలర్ల చేతివాటంతో అయోమయంలో కార్డుదారులు
- రేషన్ దుకాణంలో కిలో రూ.67.. మార్కెట్లో రూ.160


కందుకూరు రూరల్: పేదలకు అందాల్సిన కందిపప్పును కొందరు అక్రమార్కులు పక్కదారి పట్టిస్తున్నారు. వాస్తవానికి సరఫరా వాహనాల వద్ద బియ్యంతో పాటు కందిపప్పును కార్డుదారుడికి ఇవ్వాలి. అయితే ప్రస్తుతం దీని ధరలు పెరగడంతో డీలర్లు తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఒక వేళ పంపిణీ చేసినా, నాణ్యత లోపిస్తోంది. పండగ నెల్లో పేదలకు పప్పు తినే భాగ్యం కనిపించడం లేదు.

కందుకూరులో ఇలా..

కందుకూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 177 రేషన్ షాపులున్నాయి. 55 రేషన్ వాహనాల ద్వారా సరుకులను పంపిణీ చేస్తున్నారు. సుమారు 95 వేల కార్డుదారులున్నారు. ఒక్కో కార్డుకు కిలో చొప్పున ప్రతి నెలా కందిపప్పును చౌకగా అందించాలి. కిలో కందిపప్పును రూ.67కే ప్రభుత్వం చౌకగా కార్డుదారులకు అందజేస్తోంది. కార్డుకు కిలో చొప్పున 95 వేల కిలోల కందిపప్పు ప్రతి నెలా రేషన్ షాపులకు చేరుతుంది. అయితే ఎమ్మెల్‌ఎస్



నాణ్యత లోపించిన పప్పు



రేషన్ దుకాణాల్లో పంపిణీ చేసిన కందిపప్పు

పాయింట్ నుంచి బయటకొస్తున్నా, షాపులకు మాత్రం వెళ్లడంలేదు. మధ్యలోనే బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు.

ప్రశ్నిస్తే సాకులు

మార్కెట్లో ప్రస్తుతం కందిపప్పు కిలో ధర రూ.160గా ఉంది. అదే రేషన్ షాపులో రూ.67కే అందిస్తున్నారు. మార్కెట్‌కు.. రేషన్ దుకాణానికి రూ.93 వ్యత్యాసం ఉంది. ఇందులో రూ.10 తగ్గించి మార్కెట్ వ్యాపారులు తీసుకున్నా, కిలోకు రూ.83 లాభం వస్తోంది. దీంతో డీలర్లు పక్కదారి పట్టిస్తున్నారు. అరకొరగా కొందరికే ఇచ్చి ఈ నెలకు స్టాక్ ఇంతే వచ్చింది.. సర్దుకోవాలంటూ సలహా ఇస్తున్నారు. మరికొందరు డీలర్లు ఈ నెల సరఫరా కాలేదు.. వచ్చే నెలా పండగొస్తుంది.. అప్పుడే తీసుకోండంటూ మభ్యపెట్టి పంపుతున్నారు.

ఒక చోట పంపిణీ.. మరో చోట నో..

కందుకూరు మండలంలోని పలుకూరు పంచాయతీలో గల పంటవారిపాళెం ఎస్టీ కాలనీలో కందిపప్పును గత నెల్లో పంపిణీ చేశారు. అదే వాహనం పంటవారిపాళేనికి వచ్చేసరికి లేదని చెప్పారు. అదేంటి.. పక్కన ఉన్న ఎస్టీలకు ఇచ్చి మాకు లేవంటారేంటంటూ వాహనదారుడితో గ్రామస్తులు గొడవకు దిగారు. దీంతో చేసేది లేక వాహనదారులు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కందుకూరు పట్టణంలో కంది పప్పు పంపిణీయే జరగడం లేదు. గ్రామాల్లో ఉన్న వారికే ఎక్కువగా ఇస్తూ.. పట్టణ ప్రాంతంలో పెద్దగా ఇవ్వడం లేదని కార్డుదారులు ఆరోపిస్తున్నారు. అన్నీ తెలిసిన వారికి అర కిలో ఇస్తున్నారు.

నాణ్యతా కరువే

కందిపప్పులో నాణ్యత లోపించింది. పుచ్చులు, తాలు గింజలు, బూజు పట్టిన దాన్నే పేదలకు సరఫరా చేస్తున్నారు. ఒక్కో ప్యాకెట్ ఒక్కో తరహాలో ఉంటోంది. నాణ్యత లోపించడంతో కార్డుదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్యాకెట్లలో బాగానే ఉన్నట్లు కనిపిస్తున్నా, తెరిస్తే నాణ్యత బయటపడుతోంది.

మూడు మండలాలకు నిలిచిన సరఫరా

కందుకూరు నియోజకవర్గంలోని ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం మండలాలకు ఈ నెల కందిపప్పు సరఫరా కాలేదు. కందుకూరు పట్టణం, మండలం, వలేటివారిపాళేనికే సరఫరా చేశారు. పూర్తి స్థాయిలో స్టాక్ లేకపోవడంతో నిలిపేశామని, వచ్చే నెల్లో వస్తాయని అధికారులు చెప్తున్నారు. మరోవైపు డిసెంబర్‌లో క్రిస్మస్.. జనవరిలో సంక్రాంతిని గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఘనంగా జరుపుకొంటారు. అలాంటి సమయంలో సరఫరాను మూడు మండలాలకు పూర్తిగా నిలిపేయడంపై కార్డుదారులు మండిపడుతున్నారు. ఇది ఓ సమస్య అయితే, సరఫరా చేసిన మండలాల్లో డీలర్ల చేతివాటం మరో ఇబ్బందిగా మారింది. కాగా ఈ అంశమై ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ చెంచురామయ్యను సంప్రదించగా.. గుడ్లూరు, ఉలవపాడు, లింగసముద్రం మండలాలకు ఈ నెల కందిపప్పును సరఫరా చేయలేదని, స్టాక్ కొరత ఉండటంతో ఆ మండలాలకు ఇవ్వలేదని తెలిపారు. వీటికి వచ్చే నెల్లో సరఫరా అవుతాయని బదులిచ్చారు.

గుండెల్ని పిండే విషాదం

- దైవదర్శనం చేసుకొస్తుండగా చెట్టును ఢీకొన్న కారు
- నలుగురి దుర్మరణం, మరో నలుగురికి తీవ్రగాయాలు
- అందరూ బంధువులే

అందరూ ఆంజనేయస్వామి భక్తులు. ఏటా మాలధారణ చేసి స్వామి క్షేత్రాన్ని దర్శించుకుంటారు. కావలి నుంచి కాలినడకన తిరుమలలోని జపాలి తీర్థానికి ఎప్పుడూ వెళ్లేవారు. అయితే ఈసారి తెలంగాణలోని జగిత్యాల జిల్లాలో గల కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రానికి బంధువులతో కలిసి వెళ్లారు. దర్శనానంతరం తిరుగు ప్రయాణమయ్యారు. తెల్లారేసరికి ఇంటికి చేరుకునే వారు. ఇంతలోనే సంభవించిన ఘోర ప్రమాదంలో ఒకే ఊరుకు చెందిన నలుగురు దుర్మరణం చెందడంతో విషాదం మిన్నంటింది.

కావలి: సంతోషంగా దైవదర్శనానికి వెళ్లి.. తిరిగొస్తుండగా అనంతలోకాలకు వెళ్లిపోయారు. పొగమంచు, డ్రైవర్ నిద్రలేమి కారణంగా వీరు ప్రయాణిస్తున్న కారు వేగంగా వెళ్లి చెట్టును ఢీకొనడంతో పెనువిషాదాన్ని నింపింది. తెలంగాణలోని జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్ర దర్శనానికి ఎనిమిది మంది వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల సమీపంలో హైదరాబాద్ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో కారు వేగంగా చెట్టును ఢీకొనడంతో నలుగురు అక్కడికక్కడే మరణించారు. మరో నలుగురు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఒకే ఊరు.. అందరూ బంధువులు

కావలి మండలం సిరిపురానికి చెందిన తుళ్లూరు సురేష్ (40) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్, ఆయన భార్య వసంత (35), ఏబులు (40) వ్యవసాయ కూలీ. పట్టణంలోని వైకుంఠపురంలో నివాసం ఉంటూ ఆటో నడుపుకొనే తాతా తిరుపతి (60), ఆయన సతీమణి కౌసల్యమ్మ, కారు డ్రైవర్ ఉప్పాల ప్రణయ్‌కుమార్, అతని తల్లి ఆదిలక్ష్మి, ఎలక్ట్రీషియన్ ఉప్పాల శ్రీనివాసులు అందరూ బంధువులు. ఏటా ఆంజనేయస్వామి మాలధారణ చేసి తిరుమలలోని జపాలి తీర్థంలో గల ఆంజనేయస్వామి క్షేత్రానికి కావలి నుంచి కాలినడకన వెళ్లొచ్చేవారు. అయితే ఈసారి తెలంగాణలోని కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రానికి వెళ్లి దర్శనం చేసుకోవాలని భావించారు. ప్రణయ్‌కుమార్ ఇటీవల కొత్త కారు కొనడంతో అందులోనే అందరూ వెళ్లారు.

అనాథలైన పిల్లలు

పల్నాడు జిల్లా పిడుగురాళ్ల సమీపంలో జరిగిన ఘోర ప్రమాదంలో సురేష్, వసంత దంపతులు, ఏబులు, తిరుపతి మృత్యువాత పడ్డారు. సురేష్, వసంత మరణించడంతో వారి ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు.

సిరిపురంలో విషాదం

పిడుగురాళ్ల వద్ద జరిగిన ఘోర దుర్ఘటనలో తమ గ్రామానికి చెందిన నలుగురు దుర్మరణం చెందారని తెల్లారేసరికి గ్రామంలో అందరికీ తెలియడంతో విషాదం నెలకొంది. సురేష్, వసంత మృతి చెందడంతో వారి ఇద్దరు పిల్లల పరిస్థితిపై బంధువులు రోదించారు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ ఉప్పాల ప్రణయ్ కుమార్, అతని తల్లి ఆదిలక్ష్మి, ఎలక్ట్రీషియన్ ఉప్పాల శ్రీనివాసులు, కౌసల్యమ్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

అలసటగా ఉంది.. రాలేనని చెప్పినా..

కారు డ్రైవర్ ఉప్పాల ప్రణయ్‌కుమార్ ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో పనిచేసేవారు. ఫైనాన్స్‌లో కారును ఇటీవల కొనుగోలు చేసి ట్రావెల్స్‌గా నిర్వహించడానికి సిద్ధమయ్యారు. నాలుగు రోజుల క్రితమే మొదటి వాయిదా చెల్లించారు. తొలిసారిగా అయ్యప్ప మాలధారులను శబరిమల తీసుకెళ్లి తిరిగొచ్చారు. ఆ అలసట తీరక ముందే తెలంగాణలోని కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లాలని ప్రణయ్‌కుమార్‌కు బంధువులు చెప్పారు. తాను రాలేనని చెప్పినా, బంధువులు వినిపించుకోకుండా మొహమాట పెట్టారు. దీంతో ప్రణయ్‌కుమార్ తన కారులో కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి వారిని తీసుకెళ్లారు. తిరిగొస్తుండగా ఈ ఘటన జరిగింది.



సురేష్, వసంత దంపతులు (ఫైల్)



ఘటన స్థలంలో వీరి మృతదేహాలు



తిరుపతి, కౌసల్యమ్మ దంపతులు



తిరుపతి మృతదేహం



ఏబులు (ఫైల్)



ఏబులు మృతదేహం

నిమ్మ ధరలు



పెద్దవి:	రూ.31
సన్నవి:	రూ.20
పండ్లు:	రూ.12

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 94	బ్రాయిలర్
లేయర్ (లైవ్) : 110	స్కిన్‌లెస్ : 196
బ్రాయిలర్ చికెన్ : 176	లేయర్ చికెన్ : 187

రేషన్ బియ్యం పట్టివేత

- కృష్ణపట్నం పోర్టుకు లారీలో తరలింపు
- కావలి వద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు



కావలి: కృష్ణపట్నం పోర్టుకు లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని కావలి మండలం గౌరవరం టోల్‌ప్లాజా వద్ద పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. వివరాలు.. ఒంగోలు నుంచి 330 బస్తాల రేషన్ బియ్యంతో లారీ బయల్దేరింది. నెల్లూరుకు పది కిలోమీటర్ల ముందే లారీని నిలిపి ఫోన్లో సమాచారమివ్వాలని యజమాని సూచించారు. ఆపై నెల్లూరులోని వ్యక్తి సూచనలను పాటించి బియ్యం బస్తాలు దింపి వచ్చేయాలని చెప్పారు. మరోవైపు నెల్లూరు, ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో రేషన్ బియ్యం మాఫియాలో మనస్పర్థలతో ఓ గ్యాంగ్ రహస్యాలను పోలీసులకు మరో గ్యాంగ్ చేరవేస్తోంది. ఈ క్రమంలో సమాచారంతో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. అనంతరం లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కావలి రూరల్ సీఐ రాజేశ్వరరావు, ఎస్సై తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు డాన్ కనుసన్నల్లో..

పోలీసుల దూకుడుతో నెల్లూరులోని రేషన్ బియ్యం డాన్ ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి సేకరించిన బియ్యాన్ని ఎంపిక చేసుకున్న వ్యక్తుల ద్వారా నెల్లూరుకు దర్జాగా ఇప్పటివరకు ఆయన చేర్చుకున్నారు. కావలి వద్ద పోలీసులు ఆదివారం పట్టుకున్న రేషన్ బియ్యం లారీని విడిపించేందుకు.. బస్తాలను తక్కువ చేసి చెప్పించేందుకు చేసిన యత్నాలు విఫలమయ్యాయి. మరోవైపు రేషన్ బియ్యం అక్రమ రవాణాలో ఏళ్లుగా పాతుకుపోయిన వ్యక్తులను చెల్లాచెదురు చేసి.. తాను ఎంపిక చేసిన వ్యక్తులే రవాణా చేయాలనే నిబంధనను అమలు చేసేందుకు దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారు. కావలి వద్ద మూడు లారీల్లోని 995 బస్తాలు, ఉలవపాడు వద్ద లారీలోని 300 బస్తాలను పోలీసులు ఇటీవల స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు డాన్‌కు సంబంధించిన వ్యక్తులే పోలీసులకు సమాచారం అందించి పట్టించారనే టాక్ నడుస్తోంది.

బరితెగించిన భూ ఆక్రమణదారులు

- మహిళా వీఆర్‌ఏపై దాడికి యత్నం



మాట్లాడుతున్న లక్ష్మమ్మ

మర్రిపాడు: భూ ఆక్రమణదారుల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు వెళ్లిన ఓ మహిళా వీఆర్‌ఏపై దాడికి యత్నించిన ఘటన మండలంలోని నాగినేనిగుంటలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. మర్రిపాడు మండల పరిధిలోని నాగినేనిగుంట రెవెన్యూ సర్వే నంబర్ 288 – 1లో హెచ్చరిక బోర్డులను అధికారులు ఇటీవల ఏర్పాటు చేశారు. కోర్టు ఇంజంక్షన్ ఆర్డర్ ఉండటంతో సాగును ఎవరూ చేపట్టకూడదని పేర్కొన్నారు. రెవెన్యూ కోర్టులో విచారణ జరుగుతున్న సమయంలోనే పొలాన్ని కాలేపల్లి లక్ష్మీప్రసాద్, కాలేపల్లి రఘురామ్, కాలేపల్లి రాజారామ్ సాగు చేస్తున్నారనే విషయం ఉన్నతాధికారుల ద్వారా వీఆర్‌ఓకు తెలిసింది. వీఆర్‌ఏ లక్ష్మమ్మకు ఫోన్ చేసి ఘటన స్థలానికి వెళ్లి ఎవరూ సాగులోకి దిగకుండా చూడాలని చెప్పారు. దీంతో వీఆర్‌ఏ అక్కడికి వెళ్లగా, ఆమెపై దాడికి యత్నించారు. దీంతో భయంతో ఆమె తప్పించుకొని పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. తన విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దాడికి యత్నించారని తెలియజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

- రూ.1.3 లక్షల స్వాధీనం

చేజర్ల: పేకాట స్థావరంపై దాడులను పోలీసులు ఆదివారం చేపట్టారు. వివరాలు.. మండలంలోని ఆదూరుపల్లి సమీపంలో గల జామాయిల్ తోటలో పేకాటాడుతున్నారనే సమాచారం పోలీసులకు అందింది. దీంతో సంగం సీఐ వేమారెడ్డి, చేజర్ల పోలీసులు దాడులు చేశారు. పది మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1.3 లక్షలు, ఎనిమిది బైక్‌లు, పది మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై సైదులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: బైక్ అదుపుతప్పడంతో వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని ఇస్కపాళెం సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. నెల్లూరులోని పొదలకూరు రోడ్డు ప్రాంతంలో నివాసం ఉంటున్న అశోక్ పని నిమిత్తం బైక్‌పై నిడిగుంటపాళెం బయల్దేరారు. ఈ క్రమంలో ఇస్కపాళెం సమీపంలో బైక్ అదుపుతప్పింది. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.